## వరంగల్ జైలు నుంచి 17 మంది ఖైదీల విడుదల

సుబేదారి, జూలై 3 : రాష్ట్ర ప్రభుత్వం సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను బుధవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా వరంగల్ జైలు నుంచి 17 మందిని విడుదల చేసినట్లు జైలు సూపరింటెండెంట్ కళాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. హత్యా నేరాల్లో జీవిత ఖైదు పడిందని, వీరంతా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారని చెప్పారు. చర్లపల్లి జైల్లో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా వీరికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కాగా, తమ వాళ్ల విడుదల కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన వారిని కలుసుకొని సాదరంగా ఇంటికి తీసుకువెళ్లారు.

*నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న 930పీ జాతీయ రహదారి విస్తరణకు మోక్షం లభించడం లేదు. హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వరకు ఈ ఎన్‌హెచ్ పొడవు 234 కిలోమీటర్లు కాగా, మహబూబాబాద్ జిల్లాలో 80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గౌరెల్లి జంక్షన్-వలిగొండ, వలిగొండ-తొర్రూరు వరకు టెండర్లు పూర్తయి పనులు కొనసాగుతున్నాయి. తొర్రూరు నుంచి బయ్యారం మండలం నామాలపాడు వరకు పనులకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం ఎనిమిది నెలల క్రితమే ఆమోదించి నిధులు సైతం కేటాయించింది. టెండర్ల ప్రక్రియను ప్రారంభించినా అది ఇంకా పరిశీలన దశను దాటలేదు. అయితే నిధులు సర్దుబాటు కాక పనులకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా బ్రేక్ వేసినట్లు తెలిసింది. దీంతో ఈ రహదారి విస్తరణ ఎప్పుడు మొదలవుతుందో? ఎప్పుడు పూర్తవుతుందో? అన్నది తెలియక మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజలు నిరాశ చెందుతున్నారు.*

– బయ్యారం, జూలై 3



విస్తరణకు నోచుకోక బయ్యారం మండలం కొత్తపేట వద్ద గుంతలమయంగా ఉన్న ఎన్‌హెచ్ 930పీ రహదారి

# విస్తరణకు మోక్షమెప్పుడో?


రోడ్డు విస్తరణ కోసం చెట్టుకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

## మొదలు కాని ఎన్‌హెచ్ 930పీ పనులు

- తొర్రూరు నుంచి నామాలపాడు వరకు 69 కి.మీ. రహదారి
- ఎనిమిది నెలల క్రితమే రూ. 675.45 కోట్లు కేటాయింపు
- టెండర్లు పిలిచినా పూర్తికాని పరిశీలన ప్రక్రియ
- పనులకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బ్రేక్?
- నిధులు సర్దుబాటు కాకపోవడంతో నిలిపివేత
- విస్తరణ పూర్తయితే తగ్గనున్న దూరాభారం

మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి నుంచి బయ్యారం మండలం నామాలపాడు వరకు 80 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 930పీ విస్తరించి ఉంది. ఈ రహదారి గతంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండగా, నాలుగేళ్ల క్రితం ఎన్‌హెచ్ ఆధీనంలోకి వెళ్లింది. గౌరెల్లి జంక్షన్–వలిగొండ, వలిగొండ–తొర్రూరు వరకు రెండు ప్యాకేజీలకు టెండర్లు ముగిసి సైడ్ డ్రైన్‌లు, బ్రిడ్జిల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తొర్రూరు నుంచి నామాలపాడు (69 కిలోమీటర్లు) వరకు రహదారి విస్తరించేందుకు ఎనిమిది నెలల క్రితమే ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ హైవేస్ డీపీఆర్‌ను ఆమోదించి రూ. 675.45 కోట్లు కేటాయించగా, ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. అధికారులు మాత్రం విద్యుత్ లైన్లు, చెట్ల తొలగింపు కోసం సర్వే పూర్తి చేశారు.

**తగ్గనున్న దూరాభారం**

ఎన్‌హెచ్ 930పీ రహదారి పూర్తయితే మహబూబాబాద్ జిల్లావాసులకు హైదరాబాద్ ప్రయాణం సాఫీగా సాగనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, అశ్వాపురం, మణుగూరువాసులకు సుమారు 40 కిలోమీటర్ల దూరాభారం తగ్గనుంది. అలాగే వ్యాపార, వాణిజ్య పరంగా రెండు జిల్లాలు అభివృద్ధి చెందనున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోక, విస్తరణ జరగక ఈ రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం చోటుచేసుకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

**విస్తరణకు తాత్కాలిక బ్రేక్?**

ఎన్‌హెచ్ 930పీ విస్తరణకు తాత్కాలిక బ్రేక్ పడినట్లు తెలుస్తున్నది. రాష్ట్రానికి సంబంధించి పలు జాతీయ రహదారులను తాత్కాలికంగా పక్కకు పెట్టినట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వర్తమానం పంపించినట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరం నిధులు సర్దుబాటయ్యే పరిస్థితి లేకపోవడంతో టెండర్ల పరిశీలన దశలోనే ఈ రహదారి విస్తరణను నిలిపివేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించి రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఎన్‌హెచ్ 930పీ పనులు వేగవంతం చేయాలని కోరిన నేపథ్యంలో విస్తరణ పనుల్లో పురోగతి ఉంటుందా? లేదా? అనేది వేచి చూడాలి.

### విస్తరణకు కసరత్తు పూర్తి చేశాం..



ఎన్‌హెచ్ 930పీ విస్తరణ కోసం కసరత్తు పూర్తిచేశాం. జిల్లాలోని తొర్రూరు నుంచి నామాలపాడు (నెహ్రూనగర్) వరకు 68.9 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణ కోసం 675.45 కోట్లు కేటాయించారు. మూడు బైపాస్‌ల కోసం భూ సేకరణ కూడా పూర్తిచేశాం. విస్తరణలో భాగంగా తొలగించాల్సిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, వాటర్ పైప్ లైన్ల నివేదికలు సంబంధిత అధికారుల నుంచి తెప్పించాం. టెండర్ల పరిశీలన పూర్తి కాగానే పనులు ప్రారంభమవుతాయి. రహదారిపై ఉన్న గుంతలకు ఇటీవల ప్యాచ్ వర్కులు చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చూశాం.

– భగవాన్, డీఈఈ, ఎన్‌హెచ్

## నిట్ విద్యార్థికి భారీ ఆఫర్

*ప్లేస్‌మెంట్‌లో రవిషాకు రూ. 88 లక్షల వార్షిక వేతనం*

- 12 మంది విద్యార్థులకు రూ.68 లక్షలు
- 1128 మందికి ఉద్యోగ ఆఫర్లు
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి వెల్లడి

హనుమకొండ చౌరస్తా, జూలై 3: నిట్ బీటెక్ ఈసీఈ విద్యార్థికి క్యాంపస్ సెలక్షన్‌లో భారీ ఆఫర్‌తో ఉద్యోగం వరించింది. పంజాబ్‌లోని లుధియానాకు చెందిన రవిషాకు రూ. 88 లక్షల వార్షిక ప్యాకేజీ లభించింది. ఈ మేరకు బుధవారం ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన వివరాలు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి వెల్లడించారు. 2023–24 విద్యాసంవత్సరానికి 82 శాతం మంది బీటెక్, 76 శాతం ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ విద్యార్థులు ప్లేస్‌మెంట్‌ను సాధించారన్నారు. ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 250కి పైగా ప్రైవేట్ కంపెనీలు, 10 ప్రభుత్వరంగ సంస్థలు పాల్గొన్నాయని, అర్హత సాధించిన 1483 మంది విద్యార్థుల్లో 1128 మంది విద్యార్థులు ఉద్యోగ ఆఫర్లను పొందారని చెప్పారు. బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థి రవిషా సంవత్సరానికి అత్యధికంగా రూ. 88 లక్షల ప్యాకేజీని, మరో 12 మంది విద్యార్థులు రూ.68 లక్షల ప్యాకేజీని పొందారని తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పనిచేస్తున్న కంపెనీల నుంచి అత్యధిక ప్యాకేజీ ఆఫర్లు విద్యార్థులకు అందాయని, ఈ సంవత్సరం సగటు ప్యాకేజీ 15.6 లక్షలు ఉందన్నారు.

### వెరీ హ్యాపీ..



పెద్ద కంపెనీలో రూ.88 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం రావడం ఐ యామ్ వెరీ హ్యాపీ. మాది పంజాబ్‌లోని లుధియానా. మా తండ్రి బిజినెస్‌మెన్, తల్లి గృహిణి. వరంగల్ నిట్‌లో చాలా మంచి వాతావరణం ఉంది. సీనియర్ల మార్గదర్శకత్వం సహాయపడింది. పాఠ్యాంశాలు చాలా సహాయకారిగా ఉన్నాయి. ప్రొఫెసర్ల నుంచి మద్దతు లభించింది. క్యాంపస్‌కు పెద్దపెద్ద కంపెనీలు వచ్చి బిగ్ ఆఫర్ ప్రకటిస్తున్నాయి.

– రవిషా, బీటెక్ విద్యార్థి


హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు


హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణం నుంచి బయటకు వస్తున్న క్రమంలో ప్రమాదకరంగా గుంతలు

## గుంతలున్నాయ్ జాగ్రత్త..!

- ప్రమాదకరంగా హనుమకొండ బస్‌స్టేషన్ పరిసరాలు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

హనుమకొండ జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ప్రమాదకరంగా ఉన్న గుంతలు వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి. చాలాకాలంగా వాటిని పూడ్చకపోవడంతో మరింత లోతుగా మారి చుక్కలు చూపెడుతున్నాయి. ముఖ్యంగా బస్‌స్టేషన్ లోపల, అధ్వానంగా వాన నీరు నిలిచి బురదమయం అవుతున్నాయి. ఉదయమే ఇలా ఉంటే రాత్రిపూట అటు ప్రయాణికులతో పాటు బస్సు డ్రైవర్లూ ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్‌స్టేషన్ దుస్థితిని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్, జూలై 3


గుంతలమయంగా హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## అర్హులకే ప్రభుత్వ పథకాలు

- పైరవీలకు ఎలాంటి తావులేదు
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్ (మల్హర్), జూలై 3 : అర్హులైన నిరుపేదలకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మహదేవపూర్, మల్హర్ మండలాల్లో ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా మల్హర్ మండలంలోని వల్లెంకుంట గ్రామంలో రూ.12 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదిని, వల్లెంకుంట, కొయ్యూర్, తాడిచర్ల, మల్లారం గ్రామాల్లో రూ.20 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కొయ్యూర్, రుద్రారం రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేశారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి వన మహోత్సవాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 2,600 మంది విద్యార్థులకు రెండో దశ ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మహదేవపూర్ మండల కేంద్రంలో పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. దుద్దిళ్ల శ్రీపాదరావు సమీకృత మండల కార్యాలయాల సముదాయాన్ని, అంబేద్కర్ పార్క్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు స్మారక స్తూపాన్ని ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. త్వరలో స్థలం ఉన్న నిరుపేదలు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలపై మంత్రికి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బన్సోడ రాణీబాయి, జడ్పీటీసీ గుడాల అరుణ, ఎంపీటీసీలు ఆకుతోట సుధాకర్, రేవెళ్లి మమత, చల్లా రమాదేవి, మంచినీళ్ల దుర్గయ్య, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, డీఎల్‌పీవో వీరభద్రం, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ప్రసాద్, ఏపీవో రవీందర్, డీఈ సాయిలు, పలు శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారి అవినాష్, ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, ఎఫ్‌ఆర్‌వో కమల తదితరులు పాల్గొన్నారు.






## ప్రజాసమస్యలపై పోరాడండి

మానుకోట నేతలనుద్దేశించి మాట్లాడుతున్న కేసీఆర్

- బీఆర్‌ఎస్‌కు ఇక మంచిరోజులు
- మళ్లీ వచ్చేది మన పార్టీయే
- మానుకోట నేతలతో అధినేత కేసీఆర్


మాజీ సీఎం కేసీఆర్‌తో మానుకోట బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబాబాద్, జూలై 3(నమస్తే తెలంగాణ) : 'బీఆర్‌ఎస్‌కు మళ్లీ మంచిరోజులొస్తాయ్.. మరికొద్ది రోజుల్లో టార్చ్‌లైట్ పట్టుకొని జనం వెతుక్కుంటూ బీఆర్‌ఎస్‌ను వెతుక్కుంటూ వస్తారని ఆశాభావం వ్యక్తంచేస్తున్నా. అప్పటిదాకా ఓపికతో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ వారికి అందుబాటులో ఉండండి' అంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం ఎర్రవెల్లిలో తనను కలిసేందుకు వచ్చిన మానుకోట నేతలతో ఆయన సమావేశమయ్యారు. కలిసిన వారిలో ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సిరికొండ మధుసూదనాచారి, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఉద్యమకారుడు రవికుమార్, రాష్ట్ర నాయకులు బీరెల్లి భరత్‌కుమార్‌రెడ్డితో పాటు అసెంబ్లీ నియోజకవర్గంలోని 60మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సింగరేణిని ప్రైవేటీకరించొద్దు

- భూపాలపల్లిలో టీబీజీకేఎస్ ఆందోళన
- అంబేద్కర్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

కృష్ణకాలనీ, జూలై 3 : ఉత్తర తెలంగాణకు గుండెకాయలాంటి సింగరేణిని ప్రైవేటీకరించొద్దని టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.బుధవారం భూపాలపల్లి పట్టణంలోని టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ బీజేపీ 60 సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేసి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించే కుట్ర చేస్తున్నదన్నారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించడం లేదన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణలోని శ్రావణపల్లి ఓసీ వేలాన్ని అడ్డుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సదానందం, సెంట్రల్ నాయకుడు గౌరీపతిశర్మ, దేవరకొండ మధు, రామచందర్, రఘోత్తంరెడ్డి, అవినాష్, మల్లారెడ్డి, నరేశ్ నేత, లక్ష్మణ్, రాజేందర్, సాంబయ్య, వంశీ, సునీల్, మధు, రణదీప్, శ్రీధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


గురుకులంలో కనిపించిన పాము

## గురుకులంలో పాము

ములుగురూరల్, జూలై 3 : ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో బుధవారం పాము కనిపించింది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందారు. గురుకులం చుట్టుపక్కల చెట్లు ఎక్కువగా ఉండడంతో పాటు ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాములు హాస్టల్లోకి వచ్చి చేరుతున్నాయి. అధికారులు స్పందించి పాములు, విషపురుగులు గురుకులంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.













